సాక్షి
పల్నాడు

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



హుండీ ఆదాయం రూ.2.17 కోట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. రూ.2.17 కోట్ల మేర ఆదాయం లభించింది.



జిల్లా జడ్జితో కలెక్టర్ భేటీ

గుంటూరు వెస్ట్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తిని గుంటూరు కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.

అదనపు జిల్లా జడ్జితో భేటీ



నరసరావుపేట టౌన్: 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్.సత్యశ్రీను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కోర్టు కార్యాలయానికి వెళ్లి పూలమొక్క అందించారు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలసిన ఎస్పీ



నరసరావుపేట: జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాను గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలసి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, పలు అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు.

సీఎం జిల్లా పర్యటన రద్దు అవాస్తవం

నరసరావుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన రద్దు అంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమేనని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధికారులు యథావిధిగా సీఎం పర్యటన ఏర్పాట్లు కొనసాగించాలని ఆదేశించారు. జిల్లా ప్రజలు అనధికారిక, కాల్పనిక వార్తలను విశ్వసించవద్దని విజ్ఞప్తి చేశారు.

ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోలుగా నియమితులైన అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నియామక ఉత్తర్వులను అందజేశారు. గురువారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో పని చేస్తున్న నలుగురు ఏవోలు, ఆరుగురు డిప్యూటీ ఎంపీడీవోలకు ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ విడుదల చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి.జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్, జీ సెక్షన్ ఏవో పూర్ణచంద్రారెడ్డి, మోహన్‌రావు పాల్గొన్నారు.

జిల్లాలో ఎనిమిది బార్లకు లాటరీ



నరసరావుపేట: జిల్లాలోని ఎనిమిది బార్‌లకు ఓపెన్ కేటగిరీలో వచ్చిన 32 దరఖాస్తులకు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా లాటరీ పద్ధతిలో అభ్యర్థులకు షాపులు కేటాయించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నరసరావుపేట మున్సిపాలిటీలో ఒకటి, చిలకలూరిపేట, పిడుగురాళ్ల మున్సిపాలిటీల్లో రెండు చొప్పున, వినుకొండ మున్సిపాలిటీలో మూడు షాపులకు కలెక్టర్ లాటరీ నిర్వహించారు. మొత్తం 30 బార్లకు రీనోటిఫికేషన్ చేయగా కేవలం ఎనిమిది బార్లకే దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన బార్లకు ప్రభుత్వం మళ్లీ నోటిఫికేషన్ జారీ చేస్తుందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె.మణికంఠ వెల్లడించారు. జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ కె.రవీంద్ర, స్టేషన్‌హౌస్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్టును పరిశీలించిన కేఆర్‌ఎంబీ చైర్మన్



విజయపురి సౌత్: కృష్ణానది యాజమాన్య బోర్డు చైర్మన్ బీపీ పాండే ఆధ్వర్యంలో సభ్యులు కేకే జాంగిడ్ తదితరులతో కలిసి గురువారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. సాగర్ ప్రధాన డ్యామ్, గ్యాలరీలు, రైట్ కెనాల్, పవర్ హౌస్, ప్రధాన జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. స్వచ్ఛతా హీ సేవ క్యాంపెయిన్‌లో భాగంగా ప్రాజెక్టు అధికారులు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాన డ్యాం, పైలాన్ పిల్లర్ పార్కులను శుభ్రపరిచారు. పార్కులో మొక్కలు నాటారు. శుక్రవారం లో లెవెల్ కెనాల్, లెఫ్ట్ కెనాల్‌లను సందర్శించనున్నారు. కేఆర్‌ఎంబీ ఈఈ శ్రీనివాసరావు, సాగర్ డ్యాం ఈఈ సీతారాం, డీఈ అశోక్ ఆనంద్, ఏఈ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.



ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం



ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పాలకులు చేసే తప్పులు, పొరపాట్లను ప్రజలకు చేరవేయడంలో పత్రికలది ప్రధాన పాత్ర. ప్రజాస్వామ్య పరిరక్షణలో అవి కీలకపాత్ర పోషిస్తాయి. ప్రభుత్వ అవినీతిని, పాలకుల వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజలకు వాస్తవాలను చేరవేస్తోందనే అక్కసుతో సాక్షిపై కక్ష సాధింపునకు దిగడం సరైన విధానం కాదు. సాక్షి ఎడిటర్, విలేకరులపై అక్రమంగా కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేసి వాస్తవాలను బయటకు రాకుండా చేయాలనే కుట్రను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమే. సాక్షిపై ప్రభుత్వ పెద్దలు పెట్టిన కేసులను ఉపసంహరించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి.

– అంబటి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త

వాస్తవాలు రాస్తున్నారనే అక్రమ కేసులు



ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్న 'సాక్షి' పత్రికపై కూటమి ప్రభుత్వం అక్కసు వెళ్లగక్కుతోంది. ప్రజల పక్షాన మాట్లాడే ప్రతిపక్ష నేతలను, 'సాక్షి'ని నోరు మూయించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది. పత్రికలపై, విలేకరులపై అక్రమ కేసులు బనాయిస్తోంది. చంద్రబాబు పాలనలో చేసిందేమీ లేకపోయినా ఏదో అద్భుతాలు జరుగుతున్నట్లు ఎల్లో మీడియాతో చూపిస్తున్నారు. 'సాక్షి'లో వాస్తవాలు రాస్తున్నందున చంద్రబాబు బండారం ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసిపోతోంది. అందుకే 'సాక్షి' ఎడిటర్‌పై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. తప్పులను సరిచేసుకోకుండా కక్ష సాధింపు చర్యలకు ప్రభుత్వం దిగడం సిగ్గుచేటు. ఇలాంటి అక్రమ కేసులు, అరెస్టులు 'సాక్షి'ని ఏమీ చేయలేవు.

– డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త

కూటమి పాలనలో మెడికిల్

పల్నాడుకు మెరుగైన వైద్యం కలేనా!

పల్నాడు ప్రజలకు మెడికల్ విద్య, మెరుగైన వైద్యం అందని ద్రాక్షగా ఉంది. సకాలంలో మెరుగైన వైద్యం అందక పల్నాడు ప్రాంత ప్రజలు అనేక ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంత విద్యార్థులకు మెడికల్ విద్యను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు మెరుగైన వైద్య సేవలు అందించాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. దీంతో పిడుగురాళ్ల మండలం కామేపల్లిలో మెడికల్ కళాశాల, ఆస్పత్రికి శ్రీకారం చుట్టారు. రూ.500 కోట్లు మంజూరు చేయడమే కాక పనులు చురుగ్గా సాగేలా చర్యలు తీసుకున్నారు. పల్నాడు ప్రాంత ప్రజలు ఎంతో సంతోషించారు. కానీ ఆ సంతోషం ఎంతో కాలం నిలువ లేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పనులు నిలిపివేసింది. అంతేగాక ప్రైవేట్ పరం చేసేందుకు యత్నాలు ప్రారంభించింది.



కామేపల్లి గ్రామంలో వైద్యశాల, కళాశాలలో పూర్తి అయిన 100 పడకల అత్యవసర విభాగం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు పూర్తి
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఆగిన పనులు
- ప్రైవేట్ పరం చేసేందుకు యత్నాలు

పిడుగురాళ్లరూరల్/పిడుగురాళ్ల: పేదవాడికి అధునాతనమైన వైద్యం అందించాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు ప్రాంతంలోని అన్ని నియోజకవర్గాలకు దగ్గర ఉండే విధంగా పిడుగురాళ్ల మండలం కామేపల్లి గ్రామ సమీపంలో వైఎస్సార్ మెడికల్ కళాశాల, వైద్యశాలకు రూ.500 కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో ఎంతో మంది పేద ప్రజలు మనకు దగ్గరలోనే అధునాతనమైన వైద్యం అందుతుందని ఆశపడ్డారు. తీరా కూటమి ప్రభుత్వం గెలుపొందటంతో వైఎస్సార్ మెడికల్ కళాశాలకు చంద్ర గ్రహణం పట్టింది. పేదల ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది. ఏడాదిన్నర కావస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో 90 శాతం పనులు పూర్తి

పల్నాడు ప్రాంత ప్రజలంతా ఆరోగ్యం సేవల కోసం గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారని గుర్తించిన గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. వెంటనే పనులు ప్రారంభించారు. కరోనా వచ్చినా శరవేగంగా పనులు జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నారు. మెడికల్ కళాశాల, వైద్యశాల పనులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పూర్తి చేసే విధంగా కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో హాస్పటల్‌లో 100 పడకల బ్లాక్ పనులు పూర్తి చేయించి పేదలకు వైద్యం అందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లారు. 100 పడకల హాస్పటల్‌కు ఫర్నిచర్ తీసుకొని వచ్చి వైద్యులను, సిబ్బందిని నియమించినట్లయితే మెడికల్ కళాశాలలో వైద్యం సేవలు పేదవాడికి అందేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆ మెడికల్ కళాశాల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మెడికల్ కళాశాల పనులు పూర్తి చేయాలంటూ సెల్ఫీ చాలెంజ్‌లు విసిరారు. దీంతో పట్టణ, పల్నాడు ప్రాంత ప్రజలు, ప్రవాస భారతీయులు సైతం సెల్ఫీ చాలెంజ్‌లు విసిరారు. దీంతో హుటాహుటిన కూటమి నాయకులు మెడికల్ కళాశాల, వైద్యశాలను పరిశీలించారు.

9 నెలల్లో రూ.9 లక్షలు ఖర్చు చేసిన కూటమి ప్రభుత్వం

పేదవాడికి ఎక్కడ ఖరుదైన వైద్యం అందుతుందోనని కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాల, వైద్యశాల పనులను సాగనివ్వటం లేదు. పనులు సాగి వైద్యశాల పూర్తి అయితే వైఎస్సార్ సీపీకి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ఎక్కడ పేరు వస్తుందో అనే అక్కసుతో పనులను సాగనివ్వటం లేదు. దీనికి సాక్ష్యం తొమ్మిది నెలల్లో కూటమి ప్రభుత్వం కేవలం రూ.9 లక్షలు ఖర్చు చేసిందంటే పల్నాడు ప్రాంత ప్రజలు సైతం ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురవుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నేత హౌస్ అరెస్టు

సత్తెనపల్లి : వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డిని గురువారం రాత్రి 11:30 గంటల సమయంలో పోలీసులు నరసరావుపేటలో హౌస్ అరెస్ట్ చేశారు. ఇరువురు సీఐలు, ఒక ఎస్‌ఐ వచ్చి పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్దకు వెళ్లడానికి వీల్లేదంటూ నోటీసులు ఇచ్చి ఇంటి బయట పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు వైఎస్సార్ సీపీ చలో మెడికల్ కళాశాల

రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేస్తుండటంతో వైఎస్సార్ సీపీ యువజన విభాగం, అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం పిడుగురాళ్ల పట్టణం నుంచి కామేపల్లి మెడికల్ కళాశాల వరకు మెడికల్ కళాశాల, వైద్యశాల సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లా నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయనున్నారు.



పూర్తి కావొచ్చిన మెడికల్ కళాశాల బ్లాక్

ప్రైవేట్‌పరం చేయటం బాబు విజనరీ



పేదవాడికి అందాల్సిన వైద్యం ప్రైవేట్ పరం చేయటం చంద్రబాబునాయుడు విజనరీ. ఎంతో మందికి విద్యార్థులకు డాక్టర్ చేయాలని కల ఉంటుంది అలాంటి వైద్యం అందకుండా చేయాలని, పేద విద్యార్థులకు డాక్టర్ కోర్సు అందని ద్రాక్షగా ఉండాలనేదే చంద్రబాబునాయుడు విజనరీ.

– కందుల శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షులు

పేదలపై పెనుభారం



మెడికల్ కళాశాల, వైద్యశాల ప్రైవేటుకు కేటాయిస్తే పేదలపై పెనుభారం పడుతుంది. పెద్ద జబ్బులు వస్తే పొలాలు, ఇళ్లు తాకట్టు పెట్టుకునే పరిస్థితి ఉంది. వైఎస్సార్‌సీపీ తరుపున పేదవాడికి అందాల్సిన వైద్యం అందేలా చూస్తాం.

– సాంబశివరావు, గురజాల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు

చలో మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

గురజాల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం జరిగే చలో మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతం పైగా నిర్మాణం పూర్తయిన మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతి ద్వారా ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధమైందని అన్నారు. అందుకు నిరసనగా శాంతియుత నిరసన తెలియచేయడం జరుగుతుందన్నారు. ఉదయం 9.30 గంటలకు మెడికల్ కళాశాల వద్దకు చేరుకుని శాంతియుతంగా నిరసన తెలియచేయడం జరుగుతుందన్నారు.



మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ఆంక్షలు.. సిఫార్సులు



పిడుగురాళ్ల మార్కెట్ యార్డులో యూరియా కోసం బారులు తీరిన రైతులు

పిడుగురాళ్ల: సాగు సంగతి దేవుడెరుగు..యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎండను, వర్షాన్ని లెక్క చేయక పడిగాపులు పడుతున్నారు. తీరా అధికారులు ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కావాల్సిందే అని ఆంక్షలు. అవి తీసుకువస్తే ఐదెకరాలు ఉన్న వారికి రెండు కట్టలే ఇస్తామని..అన్నీ ఓకే అయితే అధికార పార్టీ నాయకుల సిఫార్సు ఉండాలంటూ వ్యవసాయశాఖ అధికారులు మెలిక పెడుతున్నారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 20 రోజుల తర్వాత పిడుగురాళ్ల పట్టణంలోని మార్కెట్ యార్డులోని సహకార సంఘానికి యూరియా స్టాకు వచ్చింది. సమాచారం తెలియడంతో రైతులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అధికార పార్టీ నేతలు తమ రైతులకు ఇవ్వాలంటూ అధికారులపై ఒత్తిడి చేశారు. దీంతో ప్రథమ ప్రాధాన్యత అధికార పార్టీ నేతలు సూచించిన రైతులకే యూరియా ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. దీంతో కొంత మంది రైతులకు మాత్రమే యూరియా అందింది. మరికొంత మంది రైతులకు యూరియా అందకపోవటంతో గత్యంతర లేక వెనుదిరిగి వెళ్లారు. అధికార పార్టీ నాయకుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా పంపిణీ రాజకీయాలు చేయడం తగదని పేర్కొన్నారు.

సమస్యలపై ఉద్యమించాల్సిన సమయం

- మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి

చిలకలూరిపేట: రాష్ట్రంలో సమస్యలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఏ సమస్యకు చెప్పుకోదగ్గ పరిష్కారం లభించలేదని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు చేపట్టిన రణభేరి కార్యక్రమం గురువారం శారదా జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగంలో సమస్యలు పరిష్కరించక పోగా, ఉపాధ్యాయులను సమాజంలో దోషులుగా చిత్రీకరించే పని జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యకు పరిష్కారం చూపకుండా ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలహీన పరుస్తోందని అన్నారు. విద్యా హక్కు చట్టం, ప్రపంచ బ్యాంక్ సాల్ట్ పథకం అమలు పేరుతో మూడో వంతు ప్రైమరీ స్కూళ్లు ఇప్పటికే సింగిల్ టీచర్ స్కూళ్లు మారిపోయాయని అన్నారు. హైస్కూళ్లలో పనిచేసే స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ పేరుతో క్లస్టర్ టీచర్లుగా, ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్లుగా పనిచేయాల్సిన పరిస్థితులు కల్పించారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రణభేరి కార్యక్రమం చేపట్టి ఈనెల 25న విజయవాడలో వేలాది మందితో బహిరంగ సభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి రణభేరి మోగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం మోహనరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టీఎస్ఎన్ మల్లేశ్వరరావు, ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు, నాయకులు షేక్ ఖాశింపీరా, జేవీడీ నాయక్, ఎ భాగేశ్వరీదేవి, బి రవిబాబు, కె తిరుపతిస్వామి, ఎ శ్రీనివాసరావు, నాసరారెడ్డి, ఎస్‌కెఎండీ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



రణభేరి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

జీజీహెచ్ కిటకిట

గుంటూరు మెడికల్: గుంటూరు నగరంలో డయేరియా కోరలు సాచింది. రోజురోజుకు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితుల సంఖ్య పెరుగుతోంది. బుధవారానికి 30 మందికి పైగా చికిత్స పొందారు. గురువారానికి ఈ సంఖ్య 60కు చేరుకుంది. బాధితుల వివరాలను ఆసుపత్రి అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. కేసుల సంఖ్య ఎక్కువే ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రత్యేక వార్డులో సెలైన్ స్టాండ్లు కరువు

డయేరియా బాధితుల కోసం ఆసుపత్రిలో జనరల్ సర్జరీ విభాగంలో 333వ నంబరు గదిని కేటాయించారు. అయితే, రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నా దానికి తగ్గట్టుగా వార్డులో సౌకర్యాలు పెంపొందించలేదన్న విమర్శలు ఉన్నాయి. సెలైన్ స్టాండ్‌లు లేకపోవడంతో మంచాలకు, గోడలకు బాటిళ్లు వేలాడదీస్తున్నారు. గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, ఇతర పార్టీల నేతలు రోగులను పరామర్శించారు. ఈ సమయంలో మంచాలకు, గోడలకు సైలైన్ బాటిళ్లు వేలాడదీసిన దృశ్యాలు కనిపించడంతో ప్రజాప్రతినిధులు సైతం నివ్వెరపోయారు.

లిఫ్టులు పనిచేయక అవస్థలు

ఇన్ పేషెంట్ విభాగంలో లిఫ్టులు పనిచేయడం లేదు. బాధితులు చికిత్స పొందే వార్డుకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ సాధారణ రోగులు సైతం ఇన్‌పేషెంట్ విభాగంలో అడ్మిట్ అయి, చికిత్స పొందేందుకు లిఫ్టులు పనిచేయక యాతనపడుతున్నారు. మూడు రోజులుగా డయేరియా బాధితులు వస్తున్నా మరమ్మతులు చేయించకుండా ఆసుపత్రి అధికారులు మిన్నకుండి పోవడంతో రోగుల బాధలు వర్ణనాతీతంగా మారాయి.



చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

డీఎంహెచ్‌ఓ పరామర్శ

గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి గురువారం పరామర్శించారు. ఏఏ ప్రాంతాల నుంచి వచ్చారు.. ఆరోగ్యం ఎలా ఉందంటూ ప్రశ్నించారు. చికిత్స పొంది డిశ్చార్జి అయిన ఐదుగురి నివాసాలకు ఆరోగ్య సిబ్బందిని పంపించారు. నీరసంగా ఉన్న వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ వార్డులో చికిత్స పొందుతున్న బాధితులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వార్డులో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన ఆదేశించారు.

క్లుప్తంగా

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

పోక్సో కేసు నమోదు

సత్తెనపల్లి: విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు .. పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడి ఏరియాకు చెందిన దంపతులు 10 ఏళ్ల కిందట విడిపోయారు. భర్త హైదరాబాదులో ఉంటుండగా ఆమె సిమెంట్ పనులకు వెళుతూ కుమార్తెను చదివిస్తుంది. కుమార్తె పట్టణంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసిస్తుంది. ఈ క్రమంలో ఆ విద్యార్థిని మున్సిపల్ కార్యాలయ ఎదురుగా ప్రకాష్‌నగర్‌కు చెందిన మున్సిపాల్టీలో స్వీపర్‌గా పనిచేస్తున్న గొల్లపల్లి పేతురుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యారు. ఏడాదిన్నర నుంచి వారి మధ్య ఫోన్ ద్వారా సంబంధాలు నడుస్తున్నాయి. ఈనెల 17న మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో పాఠశాలలో ఒకరి వద్ద ఫోన్ తీసుకొని ఆ విద్యార్థిని తనకు పరిచయస్తుడైన పేతురుకు ఫోన్ చేసింది. అతను పాఠశాల వద్దకు వచ్చి ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని తన ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. విద్యార్థిని బయటకు వెళ్లి రెండు గంటలు అయినప్పటికీ రాక పోవడంతో పాఠశాలలోని ఉపాధ్యాయురాలు విద్యార్థిని తల్లికి ఫోన్ చేసి మీ కుమార్తె కడుపులో నొప్పి అని చెప్పి ఎవరికో ఫోన్ చేసి ద్విచక్ర వాహనంపై వెళ్లిందని, తిరిగి ఇంతవరకు పాఠశాలకు రాలేదని చెప్పారు. దీంతో తల్లికి అనుమానం వచ్చి ప్రకాష్‌నగర్ వెళ్లి చూడగా ఆమె అక్కడ ఉంది. దీంతో తల్లి ఎందుకు ఇక్కడ ఉన్నావని కుమార్తెను ప్రశ్నించడంతో కడుపు నొప్పిగా ఉండటం వలన వచ్చానని, ఉప్పునీళ్లు తాగినట్లు చెప్పటమే కాక తనను ఇలానే ఇబ్బంది పెడితే తాను తన తండ్రి వద్దకు వెళ్తానని వాదించింది. యువకుడి మాయమాటలు కారణంగా తన కుమార్తె ఇలా ప్రవర్తిస్తుందని గ్రహించి ఆమె పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జరుగుతున్న వ్యవహారంపై ఫిర్యాదు చేయగా .. పట్టణ ఎస్‌ఐ జె.శ్రీనివాసరావు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి



మంగళగిరి: మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వడం వల్ల ఆత్మహత్యలను నివారించవచ్చని ఎయిమ్స్ ప్రొఫెసర్, డైరెక్టర్ డాక్టర్ అహెంతమ్ శాంత సింగ్ తెలిపారు. నగర పరిధిలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం ముగింపు సందర్భంగా డాక్టర్ అహెంతమ్ శాంత సింగ్ మాట్లాడుతూ ఆత్మహత్యల నివారణకు హెల్ప్ లైన్ నంబర్ 7331115179ను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం,సృజనాత్మకత, విమర్శనాత్మకత ప్రోత్సహించే విధంగా పెయింటింగ్, వకృత్వం పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ అధికారులు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తే సహించం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నారాయణపురంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల
- చలో మెడికల్ కళాశాలను విజయవంతం చేయండి

గురజాల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నిర్మాణం చేపట్టిన వైద్య కళాశాలలను పీపీపీ విధానంతో ప్రైవేట్‌పరం చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గ పరిశీలకుడు యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ)లు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలోని ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద మెడికల్ కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చి 90 శాతం పైగా పనులు పూర్తి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. వాటిల్లో పరికరాలు సమకూర్చితే వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావచ్చన్నారు. కానీ కూటమి నాయకులు మాత్రం వాటిని ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనతో ఉన్నారన్నారు. ప్రైవేటీకరణ ఆలోచన వెనక్కి తీసుకుని వాటిని ప్రారంభించి వైద్య సేవలు, వైద్య విద్యను నిరుపేదలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగే చలో మెడికల్ కళాశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు వి అమరారెడ్డి, పట్టణ కన్వీనర్ కె అన్నారావు, మండల కన్వీనర్ కొమ్మినేని బుజ్జి, పీర్ అహ్మద్, వేముల చలమయ్య, వంకాయలపాటి మల్లయ్య, మన్నెం ప్రసాద్; జక్కా సత్యం, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులున్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం

పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయటం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు మాదాల కిరణ్‌కుమార్, చింతా సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన ఏడాదిలోనే పేదవాడికి వైద్యం అందించాలని రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలను తీసుకొని వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటిని ప్రైవేట్ పరం చేసి వ్యాపారం చేసి జేబులు నింపుకోవాలని చూస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసే ఆలోచన ఆపకపోతే వైఎస్సార్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

శుక్రవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం, అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీని సందర్శిస్తామని తెలిపారు. కార్యక్రమం ఉదయం పిడుగురాళ్ల వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ప్రారంభమై మెడికల్ కళాశాల వరకు కొనసాగుతుందని, అనంతరం మెడికల్ కళాశాల సందర్శిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, బీసీ సెల్ మాజీ అధ్యక్షులు కందులూరి శివయ్య, జిల్లా యువజన విభాగ నాయకులు జబ్బీర్, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలను అమ్మేసుకుంటున్నారు..

దాచేపల్లి: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను అమ్ముకుంటుందని జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే 17 మెడికల్ కళాశాలలను తెచ్చిన ఘనత నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రూ.8వేల కోట్లు విలువ చేసే మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం అక్రమంగా ప్రైవేటీకరణ చేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందకుండా చర్యలు తీసుకుంటుందని మండిపడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే దాదాపు అన్ని మెడికల్ కళాశాలల నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ మెడికల్ కళాశాలలను పూర్తిగా విస్మరించిందని చెప్పారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం తలపెట్టిన చలో మెడికల్ కళాశాల కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ కందుల జాను మాట్లాడుతూ మెడికల్ కళాశాలను సకాలంలో పూర్తి చేస్తే వెనుకబడిన పల్నాడు ప్రాంతం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభాని, అధికార ప్రతినిధి షేక్ జాకీర్ హుస్సేన్, వైస్ చైర్మన్‌లు కొమెరాబత్తిన విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్, నాయకులు అనుమల రామిరెడ్డి, కొప్పుల రవి, పరిమిబాబు, ముడి విక్టర్ పాల్, కోలా జంపాలరెడ్డి, జక్కా అశోక్, షేక్ డాడీ, కుందూరు తిరుపతిరెడ్డి, ఉప్పతల ఎల్లయ్య, పాల్గొన్నారు.

వైద్య విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి
- నేడు చలో పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాల



మాట్లాడుతున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి

సత్తెనపల్లి: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ–పీపీపీ విధానం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్య, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు మంజూరు చేయించారని గుర్తు చేశారు. ఇందులో ఐదు కళాశాలలు ప్రారంభమయ్యాయని, మిగిలిన కళాశాలలు చివరి దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మెడికల్ కాలేజీలు నిర్వహణ చేపట్టలేమని కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరించాలని పీపీపీ విధానం తీసుకురావడం సరైనది కాదన్నారు. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తామంటూ అధికారంలోకి వచ్చాక ఉన్న సంపదను అమ్మేస్తున్నారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ప్రయత్నం చేయకపోగా .. పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మేల్కొని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలన్నారు. లేకుంటే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వైఎస్సార్ సీపీ తరఫున అడ్డుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఉదయం 9:00 గంటలకు సత్తెనపల్లి లోని చెక్‌పోస్ట్ వద్ద నుంచి చేపట్టే చలో పిడుగురాళ్ల(కామేపల్లి) ప్రభుత్వ వైద్య కళాశాల కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు, యువకులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జునయాదవ్, నాయకులు పక్కాల సూరిబాబు, రాజారపు శివనాగేశ్వరరావు, షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, నక్కా శ్రీనివాసరావు, వేపూరి శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, బండి కోటినాగిరెడ్డి, అచ్యుత శివప్రసాద్, వేల్పుల వెంకటేశ్వర్లు, యాసారపు బాబు, కంఠమనేని చందు, మేడ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గొలమారి వెంకట్రామిరెడ్డి, ముక్తార్, సయ్యద్ గోర, కొణతం స్వాతి తదితరులు ఉన్నారు.

టీడీపీ గ్రూపు విభేదాలతో నిలిచిన యూరియా పంపిణీ



చాగంటివారిపాలెం గ్రామసచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో అధికార తెలుగుదేశం పార్టీ నేతల మధ్య విభేదాలతో గురువారం యూరియా పంపిణీ నిలిచిపోయింది. రైతులకు యూరియా కట్టలు అందించేందుకుగాను వ్యవసాయశాఖ అధికారులు 200 మందు కట్టలను గ్రామ సచివాలయంలో దింపారు. ఆ మేరకు మందు కట్టలు పంపిణీ చేసేందుకుగాను బుధవారం గ్రామంలో టీడీపీలోని ఒక గ్రూపు నాయకులు టోకెన్‌ల పంపిణీ చేపట్టారు. ఒక్కొక్క రైతుకు ఒక యూరియా, ఒక డీఏపీ కట్ట చొప్పున మొత్తం 100 మందికి టోకెన్‌లు అందించారు. మరో గ్రూపునకు చెందిన వారు తమకు ప్రాధాన్యం లేకుండా పోయిందని టీడీపీ మండల స్థాయి నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. టోకెన్‌లు అందరికీ సమానంగా అందించాల్సిందేనని పట్టుబట్టారు. వ్యవసాయశాఖ అధికారులు గురువారం టోకెన్‌లు ఇచ్చిన వారికి మందు కట్టలు పంచేందుకు సిద్ధమవుతుండగా టీడీపీలోని ఒక గ్రూపు వారు సచివాలయం వద్దకు వచ్చి టోకెన్‌ల పంపిణీ ఎలా చేపట్టారంటూ వాదనకు దిగారు. ఇంత మంది రైతులుంటే కేవలం వంద మందికే, అందులోను ఒక గ్రూపు వారికే టోకెన్‌లు ఎలా ఇస్తారని, అందరకీ ఇవ్వాల్సిందేనంటూ భీష్మించుకుకూర్చున్నారు. కొద్దిసేపు ఇరు గ్రూపు వారు వాదనలతో గందరగోళ పరిస్థితి నెలకొంది. వ్యవసాయశాఖ అధికారులు రెండు గ్రూపుల వారికి నచ్చచెప్పలేక పంపిణీని తాత్కాలికంగా వాయిదా వేసుకొని వెళ్లిపోయారు. యూరియా కోసం పడిగాపులు కాసిన రైతులు తెలుగుదేశం పార్టీ నేతల తీరుతో యూరియా తీసుకోకుండానే వెనుతిరిగారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు

కలెక్టర్‌కు ముందస్తు నోటీసు అందజేసిన జేఏసీ నాయకులు



కలెక్టర్‌కు ముందస్తు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

నరసరావుపేట: సచివాలయ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే నిరసన కార్యక్రమాలు చేపట్టే పరిస్థితి వస్తుందని పల్నాడు జిల్లా విలేజ్, వార్డు సచివాలయ ఉద్యోగ జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కృతిక శుక్లాకు తమ సమస్యలపై ముందస్తు సమ్మె నోటీసు సమర్పించారు. విద్యార్హతలకు అనుగుణంగా విధులు అప్పగించాలని, ఇంటింటి సర్వేల నుంచి విముక్తి కలిగించాలని, ఉద్యోగులను వారి మాతృశాఖలకు బదిలీ చేయాలని, ఆదివారాలు, పండుగలు, సెలవుదినాల్లో బలవంతపు విధులు ఆపాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరుచేసి ప్రత్యేక ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, రికార్డు అసిస్టెంట్ కేడర్‌ను జూనియర్ అసిస్టెంట్ కేడర్‌గా మార్చాలని, స్టేషన్ సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే 15రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే, ఏపీ విలేజ్, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జేఏసీ నాయకులు కొమ్మాలపాటి ప్రతాపకుమార్, చెన్నయ్య, కరిముల్లా, మేడా నాగేశ్వరరావు, ఆంజనేయులు, జయలక్ష్మి, చింతా ఆంజనేయులు, ఆనందకుమార్, సాంబశివరావు ఉన్నారు.

ఉపకార వేతనాల కోసం నమోదు చేసుకోండి

నరసరావుపేట: పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థిని, విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్‌లో కళాశాల లాగిన్‌లో ఈనెల 30వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ సాధికారిత అధికారి ఈ.రాజేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2025–26 విద్యాసంవత్సరంలో డిగ్రీ నుంచి పీజీ వరకు విద్య అభ్యసిస్తున్న టెక్నికల్, నాన్ టెక్నికల్ విద్యార్థులను ప్రిన్సిపల్ రెన్యువల్, ఫ్రెష్ ఉపకార వేతనాలకు లాగిన్ చేయాలన్నారు. సిక్స్‌స్టెప్ వెరిఫికేషన్ కోసం సచివాలయాలకు పంపించాలని, అర్హత గల విద్యార్థులు ఉపకార వేతనాలు పొందకపోతే కళాశాల యాజమాన్యాన్ని బాధ్యులు చేస్తామని ఆమె హెచ్చరించారు.

గుంటూరు చానల్‌లో పడి వ్యక్తి గల్లంతు

కాజ(మంగళగిరి): గుంటూరు చానల్‌లో పడి వ్యక్తి గల్లంతైన ఘటన కాజలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు గురువారం తెలిపిన వివరాల మేరకు... కాజ గ్రామానికి చెందిన దొడ్డక రాంబాబు(40) పొలానికి వెళ్లి వస్తూ ప్రమాదవశాత్తూ గుంటూరు చానల్‌పై ఉన్న వంతెన మీద నుంచి కాలువలో పడి గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు రూరల్ ఎస్‌ఐ వెంకట్ ఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకుని, గాలింపు చర్యలు చేపట్టారు. వంతెన శిథిలావస్థకు చేరడంతోపాటు ఇరువైపులా ప్రహరీ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతు న్నాయని స్థానికులు తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాంబాబు భార్య ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తోంది.

రైలు కింద పడి వ్యక్తి మృతి



పిడుగురాళ్ల: గుర్తు తెలియని వ్యక్తి మాచర్ల, గుంటూరు ప్యాసింజర్ రైలు కింద పడి మృతి చెందిన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్డులోని రైల్వే గేటు సమీపంలో గురువారం జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలు...గుంటూరు నుంచి మాచర్ల వెళ్తున్న ప్యాసింజర్ రైలు ఢీకొనటంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 42 సంవత్సరాలు ఉంటుందని, మృతుడు ఎర్ర రంగు చొక్కా ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదని, మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. మృతుడికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

జాబ్ మేళాలో 66 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగ మేళాకు హాజరైన యువతీ,యువకులు

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 66 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజిరావు మాట్లాడుతూ ఉద్యోగ మేళాకు 175 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కాగా 10 కంపెనీల ప్రతినిధులు హాజరై 66 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు ఉద్యోగ మేళాకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.పద్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ వారు ఈ ఉద్యోగ మేళాను సత్తెనపల్లిలో నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. నియామక పత్రాలు అందుకున్న యువతకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పల్నాడు జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎం.రవీంద్రనాయక్, సత్తెనపల్లి స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఇందూరి రామకృష్ణారెడ్డి, సురేష్, రమ్య, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు నాయక్
- సత్తెనపల్లిలో యూనియన్ పల్నాడు జిల్లా రెండవ మహాసభలు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆంజనేయులునాయక్

సత్తెనపల్లి: ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయులునాయక్ డిమాండ్ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం యూనియన్ పల్నాడు జిల్లా ద్వితీయ మహాసభ నిర్వహించారు. ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ వేధింపులు ఆపాలని, నెట్‌వర్క్ స్పీడ్ పెంచాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలను కార్మికులుగా గుర్తించి గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి మూడు సంవత్సరాల కార్యకలాపాల రిపోర్టును సభలో ప్రవేశపెట్టారు. సమస్యలపై పలు తీర్మానాలను ప్రతినిధులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ముందుగా యూనియన్ పతాకాన్ని జిల్లా అధ్యక్షురాలు మెట్టిల్లా దేవి ఆవిష్కరించారు.

అనంతరం జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రసన్న విధుల్లో మరణించిన వర్కర్లకు, హెల్పర్లకు సంతాపం ప్రకటిస్తూ నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్యాల మహేష్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజని, రాష్ట్ర కమిటీ సభ్యురాలు గద్దె ఉమశ్రీ, సీఐటీయూ పట్టణ నాయకులు ఎం హరిపోతురాజు, జడ రాజ్‌కుమార్, సత్తెనపల్లి ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, అహల్య, క్రోసూర్ ప్రాజెక్ట్ కార్యదర్శి జయలక్ష్మి, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాజెక్టులు నుంచి పలువులు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ఏఎల్.ప్రసన్న



శాంతమణి

అధ్యక్షకార్యదర్శులుగా ప్రసన్న, శాంతమణి

ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా అధ్యక్షురాలుగా ఏఎల్ ప్రసన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షురాలుగా గుంటూరు మల్లేశ్వరి, కార్యదర్శిగా శాంతమణి, కోశాధికారిగా మాధవితోపాటు మరో 20 మందితో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.